క్లుప్తంగా

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: 60వ వార్డు గుల్లలపాలెం, వాకర్స్ గ్రౌండ్‌లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు గుడ్లు, పాలు, కేక్, బిస్కెట్లను వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ చేతుల మీదుగా అందించారు. పీవీ సురేష్ మాట్లాడుతూ చిన్నారులు టీవీలు, మొబైల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. చదువు, క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథునికి పూజలు



పూజలందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం: వైశాఖ మాసం గురువారం సందర్భంగా 60వ వార్డు పరిధి గుల్లలపాలెం, మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. దీనిలో భాగంగా తెల్లవారుజామున ఆరు గంటలకు బాబాకు హారతి ఇచ్చారు. అనంతరం విభూది, పంచామృతాలు, సుగంధ పుష్పాలతో బాబాకు అభిషేకం నిర్వహించారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మలేరియా విభాగ అధికారి రవికుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పరిధిలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ కార్యక్రమానికి అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యూ నుంచి బయటపడవచ్చన్నారు. నిత్యం పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిపై దోమలు చేరకుండా వాటిపై మూలు అమర్చాలని సూచించారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం



మాట్లాడుతున్న దినూప్

దాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 7675861446, 0891–2568264 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. చర్మవ్యాధులు, ఆర్థ్రరైటిస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో నేరుగా వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

40 ఏళ్ల కల సాకారమైన వేళ..

- రూ.9 కోట్లతో అండర్ పాస్‌వే నిర్మాణం పూర్తి
- 14 గ్రామాల కష్టాలు తీరిన వైనం



బాజి జంక్షన్ రహదారి నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారిలో అండర్ పాస్‌వే ఎప్రోచ్ రోడ్డు



కొత్తపాలెం చంద్రగనర్ వద్ద అండర్‌పాస్‌వే రహదారి



కొత్తపాలెం నుంచి వెళ్లే అండర్ పాస్‌వే

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గవాసుల 40 ఏళ్ల కల సాకారమైంది. దీంతో కొత్తపాలెం పరిసర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపాలెం నుంచి గోపాలపట్నం వెళ్లేందుకు అండర్‌పాస్‌వే నిర్మాణం పూర్తయింది. 40 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైల్వే ట్రాక్‌పై నుంచి వెళ్లే క్రమంలో పాదచారులు ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితులున్నాయి. అండర్ పాస్‌వే పూర్తికావడంతో ప్రజల రహదారి కష్టాలు తీరాయి. చిన్నచిన్న పనులు మాత్రమే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.9కోట్లతో కొత్తపాలెం అండర్ పాస్‌వే నిర్మాణం చేపట్టారు. డిసెంబర్ 23న ప్రారంభించిన పనులు 12 గంటల్లో పుష్ బ్యాక్ బ్లాక్‌లు ఏర్పాటు చేసి ట్రాక్‌లు పునరుద్ధరించారు. ఇటీవలే అండర్ పాస్‌వేలో ప్రయాణించేందుకు రైల్వే అధికారులు అవకాశం కల్పించారు. ఈ రహదారి గుండా వెళ్లిన వారు ఎంతో సౌకర్యవంతంగా ఉందని చెబుతున్నారు. ఇక్కడి నుంచి నేరుగా బాజి జంక్షన్‌కు చేరుకోగలుతున్నామని ప్రయాణికులు తెలిపారు. పుష్ బ్యాక్ నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తయినా అప్రోచ్ రహదారి నిర్మాణానికి చాలా జాప్యం అయింది. దీంతో ఈ రహదారి ప్రజలకు అందుబాటులోకి రావడం ఆలస్యమయింది. ఈ పనులు 2020లో అప్రూవల్ అయినా కంటకాపల్లి వద్ద చోటు చేసుకున్న ప్రమాదం, అక్కడి ట్రాక్‌ల పునఃనిర్మాణం, అండర్ పాస్‌వే నిరాణ పనులు కారణంగా జాప్యం అయింది.

ఇబ్బందులు తీరుతున్నాయి...

కొత్తపాలెం పరిసర 14 గ్రామాలకు కష్టాలు తీరాయి. ఇప్పటి వరకు కొత్తపాలెంకు సరైన దారి లేక చాలా ఇబ్బందులు పడ్డామని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లు వచ్చేవి కావు. ఒక్కోసారి ప్రణాలు, ఆస్తి నష్టాలు చవి చూశాం. ఇపుడు అండర్ పాస్ సబ్‌వే నిర్మాణం పూర్తవడంతో మా కష్టాలు తీరుతున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మా కష్టాలు తీరాయి



అండర్ పాస్‌వే నిర్మాణం పూర్తయింది. మా కష్టాలు తీరాయి. తొలుత ఫ్లైఓవర్ కావాలని కోరాం. పలుమార్లు అర్జీలు పెట్టాం. కానీ నెరవేరలేదు. కనీసం అండర్ పాస్‌వే నిర్మించారు. ఇన్నాళ్లకు మా కష్టాలు తీరాయి. చాలా సంతోషంగా ఉంది.

–జి.శ్రీనివాసరావు చంద్రనగర్

చాలా ఆనందంగా ఉంది



అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, భారీ వాహనాలు రావాలన్నా గతంలో ఇబ్బంది ఏర్పడేది. మాకు మరో దారి లేదు. రెండు అండర్‌పాస్ వేలు కూడా ద్విచక్ర వాహనాలకు, కార్లకు పరిమితమైంది. పాత గోపాలపట్నం నుంచి వెళ్లే దారిలో రెండు గేట్లు దాటి రావడానికి గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి.

–జి.కిరణ్ కుమార్, యల్లపువానిపాలెం

ఇబ్బందులు తప్పాయి



ఈ అండర్‌పాస్‌వే ఎత్తు పెంచి నిర్మించారు. దీంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండదు. దీంతో అత్యవసర సర్వీసులు మా ప్రాంతానికి అందుబాటులోకి వస్తాయి. ఇన్నాళ్లు ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడని లేవు. రహదారి అందుబాటులోకి రావడంతో చాలా సంతోషంగా ఉంది.

–ఆళ్ల నరేంద్ర బాబు, కొత్తపాలెం

ఏ నలుగురు కలిసినా అదే చర్చ



గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయ నిశ్శబ్దం కొనసాగుతోంది. ఎన్నికల పోలింగ్ ముగియడం.. భారీగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోవడంతో దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా భారీగా నమోదైన పోలింగ్ సరళిపైనే మాట్లాడుకుంటున్నారు. వృద్ధులు, మహిళలు అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఖుషీగా ఉన్నారు. అలాగే గత రికార్డులను తిరగరాసి అత్యధికంగా పశ్చిమలో పోలింగ్‌జరగడంపై కూడా చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు ముందస్తు శుభాకాంక్షలు కూడా చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ ఎక్కువ శాతం నమోదైందని అది తమకు అనుకూలమని టీడీపీ భావిస్తోంది. జూన్ 4వ తేదీ వరకు ఎవరి ఊహాగానాలు వారివి..ఫలితాలు వచ్చే వరకు ఓటర్ల నాడి అంతుపట్టదు.

జోరుగా పందేలు...

పశ్చిమలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని కొందరు.. టీడీపీ గెలుస్తుందని కొందరు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. లక్షల్లో పందేలు సాగుతున్నాయి. రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ గాలి కొనసాగుతుందని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని పలువురు చెబుతున్నారు.

ఎంవీఐ మాధవికి డాక్టరేట్



ఏయూ కులపతి ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న ఎంవీఐ మాధవి

గోపాలపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని, విశాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ.మాధవికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్య ఎల్.ఎస్.వి.ప్రసాద్ పర్యవేక్షణలో డీజిల్ ఇంజన్లలో ఉద్గారాలను తగ్గిస్తూ, సామర్థ్యాన్ని పెంచే దిశగా జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ సాధించారు. బయో డీజిల్‌లో టైటానియం నానో పార్టికల్స్‌ని జోడించి ఇంధనంగా ఈ పరిశోధనలో ఉపయోగించారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులను గురువారం స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీసీ డాక్టర్ జి.సి.రాజారత్నం, ఏవో ఐ.రఘుబాబు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఎంవీఐ మాధవిని అభినందించారు.



కాన్వెంట్ జంక్షన్‌కు కొత్త కళ తీసుకొచ్చిన అంబేద్కర్ కూడలి



ఆకట్టుకుంటున్న వైజాగ్ పోర్ట్ సింబల్



పోర్టు ముఖద్వారం వద్ద ఆకట్టుకుంటున్న సీహార్స్ ప్రతిమలు

అందంగా.. ఆకర్షణీయంగా..

- చూడముచ్చటగా డాల్ఫిన్ కూడలి
- సరికొత్తగా సీహార్స్ ప్రతిమలు
- అదనపు హంగులతో అంబేద్కర్‌కూడలికి
- పచ్చదనం నడుమ వైజాగ్ పోర్ట్ సింబల్



డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్

జగదాంబ : విశ్వనగరంగా ఖ్యాతి గడిస్తున్న విశాఖ రోజురోజుకు సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. కాస్మోపాలిటన్ అందాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణలోని పలు ఏరియాలు మునుపెన్నడూ చూడనంత అందంగా.. ఆకర్షణీయంగా రూపొంది చూపరుల చేత 'వావ్..'అనిపిస్తున్నాయి.

దేనికదే సాటి..

అల్లిపురం దరి డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ ఆ ప్రాంతానికి కొత్త అందాలద్దుతోంది. గ్రీన్ సర్కిల్ నడుమ రెండు డాల్ఫిన్లు నీటిని బయటికి వెదజల్లుతున్నట్లు ఏర్పాటు చేసిన ప్రతిమలు అటుగా ప్రయాణించే వాహన చోదకులు.. పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా పోర్టు ముఖద్వారం వద్ద గల సీహార్స్ (సముద్ర గుర్రాలు) కొంత కాలం క్రితం శిథిలమైపోయాయి. అయితే ఇటీవల వాటికి మరమ్మతు చేసి సరికొత్తగా తీర్చిదిద్దారు. రౌండ్ రెయిలింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన సీహార్స్ చూపరుల మనసు దోచుకుంటున్నాయి. అలాగే జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన వైజాగ్ పోర్ట్ సింబల్ కూడా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. గ్రీనరీ, స్టీల్ రెయిలింగ్ నడుమ ఏర్పాటైన ఆ సింబల్ జ్ఞానాపురం ప్రాంతానికి సరికొత్త అందాలు తెచ్చిపెట్టింది. ఇక చివరిగా జ్ఞానాపురంలోనే ఏర్పాటైన అంబేద్కర్ కూడలి కూడా చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. చక్కటి సర్కిల్‌లో పూలమొక్కలు, రంగులు, విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ ఆ ప్రాంతం నుంచి చాలా దూరం వరకు కనిపించేలా సుందరంగా తీర్చిదిద్దారు.



వరుణుడు కరుణించాడు. గురువారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాడు. దీంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. తరువాత నుంచి వర్షం తగ్గినా వాతావరణం మాత్రం కూల్‌గా ఉంది. ఉద్యోగాలు వెళ్లిన వారు ఇబ్బందులు పడ్డారు. - గోపాలపట్నం

ఎన్టీపీసీలో స్వచ్ఛత పక్వాడ

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లోని సవ్యాస్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రిలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. 15 రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం సీపీజీ–3 రశ్మీ రంజన్ పరిధా, ఆపరేషన్ జీఎం సురేష్ జాన్ డేవిడ్, వీజీజీ జీఎం నోవాహు గడ్డం, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర, జీఎంలు, ఇతర అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మహిళ



కుమారుడు, కుమార్తెతో బసుమతి మండల్

అల్లిపురం : గత ఏడాది డిసెంబర్‌లో తమకు అందిన సమాచారం మేరకు భీమిలిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఒక మహిళను ఏయూటీడీటీఎస్‌ఆర్ కాంప్లెక్స్ సిబ్బంది తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. వసతి గృహంలో ఉండగానే ఆమెకు చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుని తన వివరాలు చెప్పగలిగింది. తన పేరు బసుమతి మండల్ అని, తమది పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన మొల్లాబెలియా గ్రామమని స్పష్టం చేసి.. తమ చిరునామా కూడా తెలిపింది. దీంతో ఏయూటీడీ సిబ్బంది పూణేలోని శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందజేశారు. వారు మహిళ కుమారుడు గోపాల్ మండల్, కుమార్తెకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు గోపాల్ మండల్ మాట్లాడుతూ తమ తండ్రి వేరే పెళ్లి చేసుకుని బెంగళూరు వెళ్లిపోయాడని, తన సోదరితో కలిసి కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపాడు. తమ తల్లిని అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపాడు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్షేణ అరాధన, పుణ్యావహావచనం, అంకురార్పణ, బుత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ట జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు.

నిరుపేద కుటుంబానికి ఆడారి సాయం



పెళ్లి కుమార్తె తల్లికి ఆడారి ఆనంద్ అందించిన నగదు సాయాన్ని అందిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డుకు చెందిన నూర్ జహార్ నిరుపేద. ఆయన కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. అయితే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించిన వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.25వేలు సాయంగా అందజేస్తానని గతంలో హామీ ఇచ్చారు. హామీ మేరకు ఆ నగదును వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ చేతుల మీదగా నూర్ జహార్‌కు గురువారం అందించారు. వార్డు పరిధి ఆర్‌కేపురం వద్ద కార్పొరేటర్ నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు వార్డు పార్టీ అధ్యక్షుడు జీ.వి.ఎస్.ఎస్.రాజు (కేబుల్ వాసు), చట్టి నూకరాజు యాదవ్, దాడి సత్యనారాయణ, దాసరి రవి, సోనూ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు



గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకోనున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు చేపట్టనున్నారు. ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద స్టేజీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 20న సోమవారం తొల్రేళ్ల ఉత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి స్టేజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 21న ప్రధాన పండగ జరపనున్నారు. ఉత్సవాల్లో గరిడీలు, కాళీ మాతా డ్యాన్స్‌లు, పులివేషాలు, తప్పిటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ 19 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు వేయనున్నారు. 20న తొల్రేళ్ల ఉత్సవం, 21న అనుపు కార్యక్రమం జరపనున్నారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. పండగ నేపథ్యంలో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున అమ్మవారి సదును పట్టు (ఆర్బీ క్లబ్ గొల్లలపాలెం) నుంచి అమ్మవారిని ధూప, దీప, నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పిటగుళ్లు, చెక్క భజన, పులివేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 28న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 9న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.